క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

శ్రీరంగరాజపురం: మండలంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి పర్యటిస్తారని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో మధ్యాహ్నం 1 గంటకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి ముఖ్య అతిథిగా పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయం సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని తెలిపారు.

ఎంవీఐ కార్యాలయ ఏర్పాటుకు చర్యలు


కాంప్లెక్స్ ప్రాంగణంలో చేపట్టిన శుభ్రత పనులు

నగరి: పట్టణానికి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం మంజూరైన విషయం విదితమే. ఈ కార్యాలయం ఏర్పాటు పనులు వేగం పుంజుకున్నాయి. కొండచుట్టు మండపం సమీపంలో ఉన్న కేవీకే కాంప్లెక్స్ ప్రాంగణంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. అందుకు సంబంధిత కాంప్లెక్స్ ప్రాంగణాన్ని మున్సిపల్ సిబ్బంది సోమవారం జేసీబీ సాయంతో శుభ్రపరిచారు. త్వరలో ఎంవీఐ కార్యాలయం ఏర్పాటు కానుంది.

వైఎస్సార్‌సీపీ బ్యానర్ చింపిన దుండగులు


మల్లారెడ్డికండ్రిగలో టీడీపీ అల్లరిమూకలు చింపివేసిన వైఎస్సార్‌సీపీ బ్యానర్

విజయపురం: మండలంలోని మల్లారెడ్డికండ్రిగలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యానర్‌ను టీడీపీ అల్లరిమూకలు సోమవారం చింపేశారు. ఆదివారం అనంతపురంలో జరిగిన సీఎం సభకు స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెళ్లడం గమనించిన టీడీపీ అల్లరిమూకలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యానర్‌ను చింపివేయడంపై స్థానిక సర్పంచ్ శాంతి మండిపడ్డారు. టీడీపీ నాయకులు బ్యానర్ మాత్రమే చింపగలరని, ప్రజల గుండెలో జగనన్నను తొలగించలేరని ఆమె అన్నారు. అలాగే ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కార్వేటినగరం: మండల పరిధిలోని టీకేఎం పేటకు చెందిన భూపాల్ 4వ వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంబసభ్యులు సోమవారం మండల కేంద్రంలోని వృద్ధాశ్రమంలోని అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు ఏటా తమ తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం చేపట్టడం ఆనవాయితీ అన్నారు. అదేవిధంగా వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మురళి, రాస్‌–కోఆర్డినేటర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

46 మందికి కంటి వైద్య పరీక్షలు


శిబిరంలో కళ్లను పరీక్షిస్తున్న డాక్టర్ అబ్బాస్

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం దళితవాడలో సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో సోమవారం చెన్నైలోని ఎంఎస్ కంటి ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది ఉచిత కంటి వైద్యశిబిరంలో 46 మంది రోగులు పాల్గొన్నారు. ఈసందర్భంగా 11మంది రోగులను కంటి ఆపరేషన్ కోసం రెకమెండ్ చేసినట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో రెవరెండ్ జాన్ నవీన్, తూగుండ్రం సర్పంచ్ శ్రీబాబు, పాస్టర్ దేవేంద్రన్, సభా మనేగర్, జీవరత్నం పాల్గొన్నారు.

శ్రీసిటీ డీఎస్పీగా పైడేశ్వరరావు


పైడేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న సెక్యూరిటీ చీఫ్

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీ డీఎస్పీగా జీవీఎస్ పైడేశ్వరరావు సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో చేసిన బదిలీలలో ఇక్కడ పనిచేసిన డీఎస్పీ జగదీష్‌నాయక్ బాపట్లకు, భీమవరం నుంచి పైడేశ్వరరావు శ్రీసిటీకి వచ్చారు. శ్రీసిటీ సెక్యూరిటీ చీఫ్ రమేష్, ఎస్ఐ హరిప్రసాద్, డీఎస్పీకి శాలువ కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

అధునాతనంగా ఆఖరి మజిలీ

- రూ.1.60 కోట్లతో పుత్తూరు శ్మశాన వాటిక అభివృద్ధి
- ఇకపై విద్యుత్ దహన వాటికపై అంతిమ సంస్కరణలు
- రోజా చారిటబుల్ ట్రస్ట్‌చే శివుని భారీ విగ్రహం ఏర్పాటు
- ప్రహరీ, సీసీ రోడ్లు, పచ్చికబయళ్లతో సుందరీకరణ


ఆధునీకరించిన పుత్తూరు హరిశ్చంద్ర శ్మశాన వాటిక

పుత్తూరు: పట్టణంలోని హరిశ్చంద్ర శ్మశాన వాటిక అన్ని వసతులతో విద్యుత్ శ్మశాన వాటికగా ఆధునీకరించబడుతోంది. పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా చొరవతో ఎంపీ ఫండ్స్ రూ.50 లక్షలతో పాటు మున్సిపల్ జనరల్ ఫండ్స్, 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.10 కోట్లు మొత్తం రూ.1.60 కోట్లతో అత్యాధునిక వసతులతో విద్యుత్ శ్మశాన వాటికగా తీర్చిదిద్దుతున్నారు. ఆక్రమణలకు అడ్డుకట్ట వేస్తూ ప్రహరీ నిర్మాణంతో పాటు, శ్మశాన వాటికలో సీసీ రోడ్లు, అత్యాధునిక పద్ధతుల్లో విద్యుత్ దహన వాటిక భవనం, కర్మక్రియల షెడ్డు, స్నానాల గదులు, వివిధ పూలమొక్కలతో గార్డెన్ పనులు దాదాపు పూర్తయ్యాయి. శ్మశాన వాటిక భవనంలోనే అస్తికలను భద్రపరిచే లాకర్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ముక్తిప్రదాత శివుని భారీ విగ్రహాన్ని శ్మశాన వాటిక మధ్యలో మంత్రి రోజా తన రోజా చారిటబుల్ ట్రస్ట్‌చే ఏర్పాటు చేయిస్తున్నారు. స్థానిక ప్రజలు పంచాయతీ ఆవిర్భావం నుంచి హరిశ్చంద్ర శ్మశాన వాటికలోనే దహన సంస్కరణలు నిర్వహిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా శ్మశాన వాటికలో స్థలాభావం ఏర్పడింది. శ్మశాన స్థలం సైతం కబ్జాలకు గురవుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు మంత్రి రోజా శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు చొరవ చూపారు. తిరుపతిలోని గోవింద ధామం తరహాలో అన్ని వసతులతో పాటు ఆధ్యాత్మిక చింతన ఉట్టిపడేలా గోడలపై దైవత్వాన్ని తెలియజేసే నినాదాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే వివిధ పూల మొక్కలతో ఆహ్లాదకర వాతావరణంతో శ్మశాన వాటికను సుందరీకరిస్తున్నారు. చివరిదశ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. త్వరలోనే మంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా విద్యుత్ శ్మశాన వాటికను ప్రారంభించనున్నారు.


విద్యుత్ శ్మశాన భవనం


విద్యుత్ దహన పేటిక



కర్మక్రియల షెడ్డు, శివుని భారీ విగ్రహం ఏర్పాటుకు సిద్ధం అవుతున్న దిమ్మె

థామస్ తీరు మార్చుకో..


విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి

శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ థామస్ తీరు మార్చుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి అన్నారు. సోమవారం విలేకరులపై జరిగిన దాడిని వైఎస్సార్‌సీపీ తరపున తాము కూడా ఖండిస్తున్నామని, మరి గత శనివారం గంగాధరనెల్లూరు మండలం వెజ్జుపల్లిలో థామస్ అందరి సమక్షంలో ఏబీఎన్ విలేకరి రమేష్‌ను దుర్భాషలాడి దాడికి ప్రయత్నించడం సబబేనా అని ప్రశ్నించారు. వారిని చూస్తే ఊసరవెల్లి, గురివిందగింజ సామెతలు గుర్తుకు వస్తున్నాయన్నారు. విలేకరుల అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం కట్టుబడి ఉందని, గతంలో ఇచ్చిన హామీ మేరకు వారు కోరుకున్న చోట విలువైన ఇంటి స్థలంతో పాటు పలు రాయితీలను కల్పిస్తున్నారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో విలేకరులకు ఎక్కడైనా ఒక సెంటు స్థలం ఇచ్చారా ? అని ప్రశ్నించారు. 14 ఏళ్లు ప్రజలు అవకాశం ఇచ్చినప్పుడు చంద్రబాబు నాయుడు ఎందుకు అభివృద్ధి లేదు అని ప్రశ్నించారు. టీడీపీ పాలన అంటేనే కరువుకు కేరాఫ్ అన్నారు. జగనన్న పాలనలో సమృద్ధిగా వర్షాలు కురుస్తూ, రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ కార్యదర్శి నాగమణి, దళిత సంఘ నేతలు సుబ్రమణ్యం, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సహకారం అవసరం


మాట్లాడుతున్న హెచ్‌ఎం మనోహర్ నాయుడు

పాలసముద్రం: విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల సహకారం అవసరం ఎంతో ఉందని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మనోహర్ నాయుడు తెలిపారు. సోమవారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇంటి వద్ద విద్యార్థులు ఏమి చదువుతున్నారో గమనించాలని సూచించారు. ఎలాంటి పనులు చెప్పకుండా మంచిగా చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు ఇంటి వద్ద చదువుతున్న సమయంలో టీవీలో సీరియళ్లు, సినిమాలు పెట్టవద్దని హెచ్చరించారు. విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 10/10 పాయింట్లు తెచ్చుకోవాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు కష్టపడుతున్నారని తెలిపారు. అందుకు తమవంతు కూడా సహకారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


అవార్డులు అందుకున్న వలంటీర్లతో ఎంపీపీ మునివేలు

వలంటీర్ల సేవలు మరువలేనివి

పుత్తూరు: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు పనిచేస్తున్నారని ఎంపీపీ మునివేలు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పుత్తూరు మండల పరిధిలోని వలంటీర్లను వివిధ అవార్డులు, రివార్డులతో ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నారని తెలిపారు. వలంటీర్ల పనితీరుతో ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగిందన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లను ప్రభుత్వం అవార్డులతో గౌరవిస్తోందని తెలిపారు. మండలంలో మొత్తం 133 మంది వలంటీర్లు ఉండగా ఇద్దరు సేవావజ్రా అవార్డులకు అర్హత సాధించారని తెలిపారు. మరో ఐదుగురు సేవారత్న అవార్డులను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. మిగిలిన 126 మంది సేవామిత్రలుగా నిలిచారని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఓ వాణి, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలు, పెరుగు, కుంకుమ, విబూధితో పాటు జలాలతో అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో విశేష పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

9 నుంచి తొండమాన్‌పురం వెంకన్న బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి భూదే వి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మార్చి 9 నుంచి 17వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. మార్చి 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, 9న ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య ధ్వజా రోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవు తాయన్నారు. రాత్రి శేష వాహన సేవ నిర్వహిస్తారన్నారు. రోజూ రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు వాహన సేవలు ఉంటాయ న్నారు. మార్చి 10న హంస వాహనం, 11న సింహ వాహనం, 12న హనుమంత వాహనం, 13న సాయంత్రం కల్యాణోత్సవం, రా త్రి గరుడ సేవ, 14న గజవాహనం, 15న చంద్రప్రభ వాహనం, 16న ఉదయం తిరు చ్చి, రాత్రి అశ్వ వాహన సేవలు ఉంటాయని వెల్లడించారు. 17న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు చక్రస్నానం, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహిస్తామన్నారు. 18వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పుష్పయాగం ఉంటుందని చెప్పారు.

స్పందన వినతులపై దృష్టి పెట్టండి

శ్రీరంగరాజపురం: స్పందనలో వచ్చిన వినతుల పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని మండల తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి 13 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 04, డీకేటీ పట్టా కేటాయించాలని 03, ఇంటి నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 02, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులను చూపించాలని 01, ఇంటి స్థలం ఇప్పించాలని 03 వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందనకు వచ్చే సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరు జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.

అన్ని రంగాల్లోనూ డేటా సైన్స్‌దే ప్రధాన పాత్ర

తిరుపతి సిటీ : డేటా సైన్స్ నేడు అన్ని రంగాల్లోనూ ప్రధాన పాత్ర పోషిస్తోందని మహిళా వర్సిటీ వీసీ భారతి తెలిపారు. మహిళా వర్సిటీ, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబులిటీ అండ్ స్టాటిస్టిక్స్, ఎస్వీయూ సంయుక్తంగా డేటా సైన్స్‌పై మూడో రోజు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఇందులో వీసీ భారతి, ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఆమె మా ట్లాడుతూ డేటా సైన్స్ అనేది కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, మ్యాథమ్యాటిక్స్‌గా విభజించబడిందన్నారు. ప్రతి రంగంలోనూ డేటా సైన్స్ ప్రాముఖ్యత ఉందన్నారు. ఆరోగ్యం, ఫైనాన్స్, రిటైల్, రవాణా రంగాల్లో డేటా సైన్స్ హవా నడుస్తోందన్నారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులతో డేటా సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని చెప్పారు. ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతిలోని డేటా సైన్స్ సెంటర్ ఏర్పాటు కావడం శుభపరిణామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఈ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎస్వీయూ సైతం ఐఎస్‌పీఎస్‌తో డిప్లొమో కోర్సుల విషయంలో ఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అనంతరం డేటా సైన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఐఎస్‌పీఎస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అన్నామలై యూనివర్సిటీ వీసీ ఆర్ఎం కతిరేశన్, కెనడా మెక్‌గిల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఏఎం మథై, అట్లాంటా నుంచి ప్రొఫెసర్ ఎం సంబంధం, నటరాజన్, శ్రీనివాసులు, ముళీధరన్, ఐఎస్‌పీఎస్ సెంటర్ గౌరవాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, హెచ్‌వోడీ ఎం శివపార్వతి పాల్గొన్నారు.

ప్రదీప్‌కుమార్‌కు శిక్షారత్న పురస్కారం


పురస్కారంతో ప్రదీప్‌కుమార్

శ్రీరంగరాజపురం: మండల పరిధిలోని ఈఎన్‌ఆర్‌పురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల్లో గుణాత్మక, నైతిక, శాస్త్ర సాంకేతిక నాయకత్వ లక్షణాలు పెంపొందించడం పాటు పలు సృజనాత్మక అంశాలలో నిత్యం శిక్షణ ఇస్తున్న కేఎస్ ప్రదీప్‌కుమార్‌కు శిక్షారత్న పురస్కారాన్ని సోమవారం చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన విద్యార్థి సంస్థ ఆధ్వర్యంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్ర ఉపాధ్యాయులు సంజీవ్‌కుమార్, సూర్యవంశీ వారు శిక్షారత్న పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ క్రమంలో భాగంగా చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి శిక్షారత్న పురస్కారాన్ని అందుకున్న ప్రదీప్‌కుమార్‌ను పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పలువురు అభినందించారు.

గణిత శాస్త్ర మెళకువలపై జాతీయ సదస్సు


మాట్లాడుతున్న టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ మ్యాథ్‌మ్యాటికల్ టెక్నిక్స్ అండ్ కాంపిటేషనల్ టూల్స్ అనే అంశంపై సోమవారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఇందులో టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి ప్రసంగించారు. గణిత శాస్త్రంలోని మెళకువలు విద్యార్థులకు అవసరమని, ఇలాంటి సదస్సులు వారి మెదడుకు పదను పెడతాయన్నారు. అనంతరం ఆయన ఫండమెంటల్ కాన్సెప్ట్ ఆఫ్ ఫ్లూయిడ్ డైనమిక్స్, ఫార్మలేషన్ త్రూ మ్యాట్‌లాబ్ సాఫ్ట్‌వేర్‌పై పలు అంశాలను వివరించారు. సదస్సులో ఖారగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ పీవీఎస్ఎన్ మూర్తి, పీవీ సుందర్, వీ రమేష్ బాబు, వర్సిటీ రిజిస్ట్రార్ రమాశ్రీ పాల్గొన్నారు.

కరుణాకరరెడ్డికి పరామర్శ


కరుణాకరరెడ్డిని పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని పచ్చికాపల్లం గ్రామానికి చెందిన కరుణాకరరెడ్డిని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరామర్శించారు. పచ్చికాపల్లం సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కరుణాకరరెడ్డి గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి సోమవారం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి సోమవారం వెళ్లి బాధితుడు కరుణాకరరెడ్డిని పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు, ఆరోగ్యంపై వాకబు చేశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. త్వరలో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట శ్రీరంగరాజపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మునస్వామి, డైరెక్టర్ అత్తూరు సురేష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖరరెడ్డి, సురేంద్రరెడ్డి ఉన్నారు.

నడిపమ్మకు ఘన నివాళి..

మండలంలోని దిగువపల్లాలు పంచాయతీ ఆళ్లమడుగు దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హరినాథ్ తల్లి నడిపమ్మ అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి గ్రామంలో పర్యటించి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, నాయకులు దామోదరరెడ్డి, నాగరాజు ఉన్నారు.

పుట్ట గొడుగుల పెంపకంతో అధిక లాభాలు


రైతులకు వ్యవసాయ అనుబంధ పంటలపై శిక్షణ కల్పిస్తున్న శాస్త్రవేతలు

కార్వేటినగరం: పుట్ట గొడుగుల పెంపకంతో అధిక లాభాలు సాధించవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత శ్రీనివాసులు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని అన్నూరు గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులకు వ్యవసాయ, ఇతర అనుబంధ పంటలపై శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా రాస్ కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు ఇతర అనుబంధ రంగాలైన ఉద్యానవనం, సెరికల్చర్, పుట్టగొడుగుల పెంపకం, పూల పెంపకం వంటి వాటిని సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. అలాగే వరి, వేరుశనగ, చెరుకు, నువ్వుల పంటల సాగులో మేలైన హైబ్రిడ్ రకాలు సాగు చేయడం వల్ల అధికం దిగుబడితో పాటు మంచి లాభాలు పొందవచ్చని సూచించారు. అదేవిధంగా వ్యవసాయ రంగంలో సాంకేతిక, నూతన ఒరవడులు, శాస్త్రీయ పద్ధతుల ద్వారా గ్రామాభివృద్ధి కోసం అన్నూరు గ్రామాన్ని దత్తతకు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ క్రమంలో భాగంగా మహిళా రైతులకు పుట్టగొడుగుల పెంపకం, ఇతర వ్యవసాయ అనుబంధ పరిజ్ఞానం అందించడం ద్వారా మహిళా రైతులు కూడా స్వయం సమృద్ధి సాధించగలరని అన్నారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమ శాస్త్రవేత పద్మజ, ఉద్యానవన శాస్త్రవేత పీఎస్ సుధాకర్, శాస్త్రవేత దివ్య, విస్తరణ శాస్త్రవేత రామకుమార్, మండల వ్యవసాయ అధికారి హేమలత, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, రైతులు దామోదర్‌రెడ్డి, ఏఈఓ హేమాద్రి, వీఎస్ఏ మునికృష్ణ, ఇతర రైతులు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నమోదు చేయాలి


మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: మండలంలోని వీఓఏలు రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఆర్‌పీ, సీసీఎఫ్, స్త్రీనిధి రికవరీ, ఆరోగ్య పోషణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్వాక్రా గ్రూపులకు, సిబ్బందికి రికార్డులు ఏవిధంగా రాయాలి ? స్త్రీనిధి రికవరీ ఏ విధంగా చేయాలి ? ఇంటి వద్ద పెరిటి కోళ్లు, పెరటి తోటలు ఏ విధంగా పెంచాలనే అంశాలపై వివరించారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇంతవరకు ఉన్నతి, స్త్రీనిధి తీసుకోకుండా ఉన్న సభ్యులు పాడిపశువుల కొనుగోలుకు సంబంధించిన రుణాల కోసం సంఘమిత్రాల వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, మంజుల, బాలయ్య, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు కీలకం


శిక్షణ పూర్తి చేసుకున్న మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

గంగాధర నెల్లూరు: సమాజాభివృద్ధిలో స్వచ్ఛంద సేవాసంస్థలు కీలక పాత్ర వహిస్తున్నాయని నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ ప్రదీప్ అన్నారు. గంగాధర నెల్లూరు మండల పరిధిలోని వేల్కూరులో ఉన్న క్రాస్ స్వచ్ఛంద సేవాసంస్థ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో సంస్థ అధ్యక్షుడు భూపతి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో 5000 కుటుంబాలకు బయోగ్యాస్ ప్లాంట్‌ను ఉచితంగా కట్టించి ఇచ్చామని, 1000 కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించామని, 500 కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించి ఇచ్చామన్నారు. తాజాగా తమ సంస్థ ద్వారా గ్రామాల్లోని మహిళలకు ఉచితంగా వారి ఆర్థికాభివృద్ధి కోసం టెంకాయ పీచుతో వస్తువుల తయారీపై నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్రాస్ ఉపాధ్యక్షుడు హరీష్, వెలుగు ఏపీఎం చిరంజీవి, సంస్థ డైరెక్టర్ షీలా బెంజిమన్, అబ్రహాం, సుచీ డైరెక్టర్ గ్లోరీ విజయ కుమార్, విశ్వనాథ్, పలు సంస్థల మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు గంగమ్మ ఆలయంలో బహిరంగ వేలం

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మకు భక్తులు సమర్పించే చీరలు, రవిక పీసులు సేకరించడం, అమ్మవారి ఫొటోలు, చైన్లు తదితరాలను ఏడాది పాటు విక్రయించేందుకు బుధవారం బహిరంగ వేలం వేయనున్నట్టు ఈవో మమత తెలిపారు. వేలంలో హక్కులు దక్కించుకున్న వారికి ఈ నెల 21 నుంచి 2025 ఫిబ్రవరి 20వ తేదీ వరకు లీజ్, కౌలు ఉంటుందని తెలిపారు. వివరాలకు ఆలయ కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

తిరుపతి బస్టాండ్‌లో సెక్యూరిటీని పెంచండి


ఎస్పీతో ఆర్టీసీ అధికారులు చెంగల్‌రెడ్డి, భాస్కర్

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి ప్రయాణించేవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. అదే స్థాయిలో పోలీస్ సెక్యూరిటీని పెంచాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం ఎస్పీ మలికగార్గ్‌ను ఎస్పీ కార్యాలయంలో కలిశారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి రోజు 1.60 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారని వెల్లడించారు. వేసవిలో ఆర్టీసీ ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందని, చోరీలు జరగకుండా సెక్యూరిటీని పెంచాలని కోరారు. స్పందించిన ఎస్పీ పరిశీలించిన తర్వాత చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్ ఉన్నారు.